జిల్లాలను రద్దు చేస్తే భస్మీపటలమే

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, మే 3 (నమస్తే తెలంగాణ): రేవంత్ సర్కారు కొత్త జిల్లాలను రద్దు చేస్తే ప్రజల చేతుల్లో కాంగ్రెస్ పార్టీ భస్మీపటలం కావడం ఖాయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన వనపర్తిలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు కొత్త జిల్లాలను రద్దుకు కమిటీ వేస్తున్నట్టు ప్రచారం జరుగుతుండటంపై అసహనం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రజల అభీష్టం మేరకు.. పరిపాలనా సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. జిల్లాలు ఏర్పడిన నాటి నుంచి ఆయా ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందినట్టు తెలిపారు. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలతో పాటు మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలలు ఏర్పడినట్టు చెప్పారు. గతంలో పంజాబ్, హర్యానా కలిసి ఉండగా, కాంగ్రెస్ పార్టీనే రెండు రాష్ట్రాలుగా ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ రెండు రాష్ట్రాల జనాభా దాదాపు 5 కోట్లపైబడి ఉండగా.. అక్కడ 46 జిల్లాలు ఉన్నాయని తెలిపారు. వాటితో పోల్చుకుంటే 4 కోట్ల జనాభా ఉన్న తెలంగాణలో 33 జిల్లాలు తక్కువేనని ఉదహరించారు. జిల్లాల వ్యవస్థను తొలగిస్తామని వస్తున్న లీకులపై మంత్రి జూపల్లి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మళ్లీ గోస తప్పదని హెచ్చరించారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలని కోరారు.

జిల్లాలను కుదిస్తే రాష్ట్రం అగ్నిగుండమే

- **ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమిస్తారు**
- **సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీ హెచ్చరిక**

నాగర్‌కర్నూల్, మే 3: జిల్లాలను కుదిస్తే ప్రజల ఆందోళనలతో రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన నాగర్‌కర్నూల్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కేసీఆర్ 33 జిల్లాలు ఏర్పాటు చేస్తే, కాంగ్రెస్ జిల్లాలను తగ్గించాలన్న యోచన చేస్తున్నదన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే చర్యలను రేవంత్ ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. ఎంపీ ఎన్నికల్లో ప్రాంతేతరుడైన మల్లు రవిని ఓడించాలని పిలుపునిచ్చారు. మత విభేదాలు సృష్టించే బీజేపీని ఓడించాలని కోరారు. కాంగ్రెస్ సర్కారు రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, అందుకే పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపడుతున్నట్టు స్పష్టం చేశారు. ఈ ఉద్యమానికి రైతులు స్వచ్ఛందంగా మద్దతు పలుకాలని కోరారు. స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం జారీ చేసిన జీవో 46ను సవరించి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ జిల్లా జోలికొస్తే ఊరుకోం

- **కుమ్రంభీం స్ఫూర్తితో ఉద్యమిస్తాం**
- **ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి హెచ్చరిక**

ఆసిఫాబాద్ టౌన్, మే 3 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆసిఫాబాద్ జిల్లా జోలికొస్తే ఊరుకునేది లేదని, కుమ్రంభీం స్ఫూర్తితో ఉద్యమిస్తామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. జిల్లాను తొలగిస్తే కాంగ్రెస్ పార్టీ నేతలు జిల్లాలో తిరగలేరని హెచ్చరించారు. జిల్లాల కుదింపు ఆలోచన మానుకోవాలని సూచించారు. జిల్లా ఏర్పాటు తర్వాత ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. కుమ్రంభీం ప్రాజెక్టు నిర్మాణం కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని, దాని నాణ్యత లోపానికి కాంగ్రెస్ సర్కారే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కాలువలు పూర్తికాకముందే అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించిన విషయం మర్చిపోయారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉంటేనే అభివృద్ధి చేస్తారా? అని సీఎం రేవంత్‌ను ఆమె ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ విఠల్ ఎన్నిక రద్దు

- **కాంగ్రెస్ నేత పిటిషన్‌పై హైకోర్టు తీర్పు**
- **తీర్పు అమలు 4 వారాలు వాయిదా**
- **సుప్రీంలో సవాలు చేయనున్న విఠల్**

హైదరాబాద్, మే 3, (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక చెల్లదని రాష్ట్ర హైకోర్టు ప్రకటించింది. కాంగ్రెస్ నాయకుడు పాతిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు చెప్పింది. విఠల్‌కు రూ.50 వేల జరిమానా విధించింది. తీర్పుపై అప్పీల్‌కు వీలుగా తీర్పు అమలును 4వారాల పాటు నిలిపివేయాలన్న విఠల్ తరపు న్యాయవాది విజ్ఞప్తికి అనుమతించింది. ఆదిలాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా దండె విఠల్ 2022లో ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పాతిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అయితే, తన సంతకాన్ని ఫోర్జరీ చేసి నామినేషన్ ఉపసంహరణ చేయించారని రాజేశ్వర్‌రెడ్డి హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేశారు. విఠల్ ఎన్నిక అక్రమమని, తానే ఎమ్మెల్సీగా ఎన్నికైనట్టు ప్రకటించాలని కోరా రు. పిటిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేశారో లేదో తేల్చేందుకు హైకోర్టు ఆ పత్రాలను కేంద్ర ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపింది. ఫోరెన్సిక్ ల్యాబ్ పరిశీలనలో రాజేశ్వర్‌రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేశారని తేలింది. ఈవ్యవహారంపై ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వులో పెట్టింది. జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం తీర్పు వెలువరించారు. 'ఎమ్మెల్సీ విఠల్ ఎన్నిక చెల్లదు.తిరిగి ఎన్నిక నిర్వహించాలి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిటిషనర్ రాజేశ్వర్ రెడ్డి పోటీలో లేరు కాబట్టి ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లుగా ప్రకటించేందుకు ఆస్కారం లేదు. రాజేశ్వర్ రెడ్డి సంతకాన్ని దస్తూరాబాద్ ఎంపీపీ కిషన్ సింగారి ఫోర్జరీ చేసి ఇస్తే దానిని ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిర్ధారణ చేసుకోకుండా నామినేషన్‌ను (రాజేశ్వర్ రెడ్డిది) తిరస్కరించారు. విఠల్ -కిషన్ కుమ్మక్కు అయ్యారు' అని హైకోర్టు తీర్పులో పేర్కొన్నది. ఇదిలా ఉంటే శాసనమండలి సభ్యుడిగా తన ఎన్నిక చెల్లదని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని దండె విఠల్ తెలిపారు. వేరే అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ తనకు సంబంధం లేదని పేర్కొన్నారు. తాను ఏకగ్రీవంగా ఎన్నిక కాలేదని, ఎన్నికల్లో నిలబడి గెలిచానని, అభ్యర్థుల ఉపసంహరణ ప్రక్రియ రిటర్నింగ్ అధికారికి సంబంధించినదని ఆయన వివరించారు. ఎన్నిక చెల్లదని ఇచ్చిన తీర్పుపై సుప్రీంలో న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని పేర్కొన్నారు.

దినసరి కూలీగా కిన్నెర మెట్ల మొగులయ్య

- **ఆర్థిక ఇబ్బందులతో సతమతం!**
- **సోషల్ మీడియాలో వీడియో వైరల్**
- **నేడు కేటీఆర్‌ను కలవనున్న కళాకారుడు**

అచ్చంపేట, మే 3 : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అవుసలికుంటకు చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత 12మెట్ల కిన్నెర కళాకారుడు మొగులయ్య ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అయ్యింది. 2022 మార్చి 21న పద్మశ్రీ అందుకొన్న ఆయనకు కేసీఆర్ ప్రభుత్వం రూ.కోటి నజరానా ప్రకటించింది. పిల్లల పెండ్లిళ్లు చేయడంతోపాటు హైదరాబాద్ శివారులోని తుర్కయాంజాల్‌లో 100 గజాల్లో ఇల్లు నిర్మించుకుంటున్నాడు. డబ్బులు సరిపోక పనులు ఆపేశాడు. కళాకారుడిగా రూ.10 వేలు పింఛన్ వస్తున్నది. కుటుంబ పోషణకు పింఛన్ సరిపోవడం లేదని, హయత్‌నగర్‌లో ఇంటి స్థలం కోసం జీవో ఇచ్చినా అధికారులు స్థలం అప్పగించలేదని మొగులయ్య ఆవేదన వ్యక్తం చేసినట్టు సోషల్ మీడియా లో వైరల్ అయ్యింది. మొగులయ్య తుర్కయాంజాల్‌లో గృహ నిర్మాణ పనులకు వెళ్లినట్టు కళాకారుడు ఆవేదన వ్యక్తం చేసినట్టు ఆ వీడియో మీడియాలో హల్‌చల్ చేసింది. శుక్రవారం మొగులయ్యను 'నమస్తే తెలంగాణ' ఫోన్‌లో పలుకరించగా.. కష్టాలను చెప్పుకొచ్చాడు. కేసీఆర్ ప్రభుత్వం తన కిన్నెర వాయిద్య కళను గుర్తించి ఉగాది పురస్కారం అందజేసిందని, కేంద్రం పద్మశ్రీతో సత్కరించిందని తెలిపారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలువగా పింఛన్ రూ.25 వేలతోపాటు హయత్‌నగర్‌లో 600 గజాల స్థలాన్ని ఇచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు చెప్పుకొచ్చాడు. అయితే తనకు పింఛన్ రావడం లేదని సోషల్ మీడియాలో వచ్చిన కథనాల్లో నిజం లేదని, తనకు రూ.10 వేల పింఛన్ వస్తుందని, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మరింత పెంచాలని మొగులయ్య ప్రభుత్వాన్ని కోరాడు.

మొగిలయ్య కుటుంబానికి అండగా ఉంటాం

పద్మశ్రీ మొగిలయ్య కుటుంబానికి అండగా ఉంటామని కేటీఆర్ చెప్పారు. కుటుంబాన్ని పోషించడానికి మొగిలయ్య కూలీ పనులకు వెళ్తున్నట్టు మీడియాలో వచ్చిన వార్తలపై కేటీఆర్ స్పందించారు. మొగిలయ్యను వెంటనే సంప్రదించి ఆదుకుంటామని వెల్లడించారు.

ఒక్కొక్కరూ పది ఓట్లు వేయండి

- **సిద్దిపేట సభలో మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలు**
- **కులం పేరును ప్రస్తావిస్తూ ఓట్లు అభ్యర్థన**
- **ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు**
- **ఈసీ హెచ్చరించినా మారని మంత్రి తీరు**

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : 'ఒక్కొక్కరూ పది ఓట్లు వేసైనా సరే.. మన అభ్యర్థిని గెలిపించాలని' పార్టీ కాడర్‌కు, బీసీ వర్గాలకు మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేట అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలోనే ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. కులాన్ని ప్రస్తావిస్తూ ఓట్లు అడిగారని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఆమె చేసిన ప్రసంగంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికి భారత రాష్ట్ర సమితి ఫిర్యాదు చేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన నేపథ్యంలో తెలంగాణ స్టార్ క్యాంపెయినర్‌గా రేవంత్ రెడ్డిని తొలగించాలని, రేవంత్ రెడ్డి, కొండా సురేఖలపై ప్రచారంపై నిషేధం విధించాలని, మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. మంత్రి కొండా సురేఖ చేసిన ప్రసంగాలపై బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే రెండు సార్లు ఫిర్యాదు చేసింది. ఎన్నికల సంఘం ఆమెను తీవ్ర స్థాయిలో హెచ్చరించింది కూడా. అయినా ఆమె తన ప్రసంగాలను అదే విధంగా కొనసాగిస్తున్నారు. బీఆర్ఎస్, కేసీఆర్‌లపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, కులం, మతం ప్రాతిపదికన ఓట్లు అడుగుతున్నారు.

సికింద్రాబాద్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్‌కు మద్దతుగా శుక్రవారం రాత్రి సికింద్రాబాద్, సనత్‌నగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని అడ్డగుట్ట రియో పాయింట్, సీతాఫల్‌మండి, సనత్‌నగర్‌లోని బబ్బార్ కాంప్లెక్స్, నాంపల్లిలోని నోబుల్ టాకీస్ చౌరస్తా వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ శ్రేణులతో పాటు అభిమానులు, స్థానికులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆప్రాంతాలన్నీ గులాబీమయమయ్యా. జై తెలంగాణ.. జై బీఆర్ఎస్ అంటూ నినాదాలు చేశారు.

28 ఫిర్యాదులిచ్చినా చర్యలేవీ..?

- **కేసీఆర్,బీఆర్ఎస్‌పై అభ్యంతర వ్యాఖ్యలు**
- **దేవుడిపై ఒట్టు వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి**
- **కోడ్ ఉల్లంఘనలపై ఈసీకి ఫిర్యాదులు**

రాహుల్, రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఫిర్యాదులు

ఫిర్యాదు తేదీ	నాయకుడు	అంశం
ఏప్రిల్ 8	రాహుల్ గాంధీ	ఫోన్ ట్యాపింగ్, కేసీఆర్ తప్పుడు ఆరోపణలు
ఏప్రిల్ 10	రేవంత్ రెడ్డి	తుక్కుగూడలో బీఆర్ఎస్, కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు
ఏప్రిల్ 22	రేవంత్ రెడ్డి	భువనగిరిలో కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు రుణమాఫీని ఆగస్టు 15లోగా చేస్తానని యాదాద్రి దేవుడిపై ఒట్టు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అడవి పందులు అని వ్యాఖ్యానించడం
ఏప్రిల్ 25	రేవంత్ రెడ్డి	నిజామాబాద్ సభలో రుణమాఫీ చేస్తానని బాసర సరస్వతీపై ఒట్టు
ఏప్రిల్ 25	రేవంత్ రెడ్డి	మెట్రో పిల్లర్‌లపై హోర్డింగ్స్ ఏర్పాటు
ఏప్రిల్ 25	రేవంత్ రెడ్డి	కొడంగల్ లో ప్రసంగంలో కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు
మే 1	రేవంత్ రెడ్డి	ఎక్స్ అకౌంట్‌లో ఓయూ హాస్టల్స్‌పై ఫోర్జరీ డాక్యుమెంట్ పోస్ట్ చేయడం

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): భారత రాష్ట్ర సమితి చేసిన ఫిర్యాదులపై ఎన్నికల సంఘం చర్యలకు ఉపక్రమించడంలేదని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో స్వతంత్ర సంస్థగా ఉన్న ఎన్నికల సంఘం అన్ని పార్టీలను ఒకే తీరుగా చూడాలని, అలాకాకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదని బీఆర్ఎస్ నేతలు ఆక్షేపించారు. స్వేచ్ఛగా, ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరగాలంటే ఎన్నికల సంఘం వ్యవహరించాల్సి తీరు ఇది కాదని చెబుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు 28 ఫిర్యాదులను చేసింది. అయినా కూడా ఒక్కదానిపై సరైన విధంగా సరైన సమయంలో స్పందించడంలేదని గులాబీ నేతలు విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై 8 ఫిర్యాదులు చేశారు. ఏఐసీసీ నేత రాహుల్ గాంధీపై ఫిర్యాదు చేశారు. రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఆంధ్రజ్యోతి పత్రికా యాజమాన్యం వేమూరి రాధాకృష్ణ, కే.శేషగిరిరావు, ఎడిటర్ కే.శ్రీనివాస్‌పై, బీజేపీ నేతలు రఘునందన్ రావు, బండి సంజయ్‌లపై ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్, కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపై రేవంత్ రెడ్డి ప్రతి సభలోనూ నోటికి వచ్చిన బూతులు మాట్లాడుతున్నారు. ఆధార రహిత ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా దేవుడిపై ఒట్టు వేస్తూ ప్రజలకు హామీలు ఇస్తున్నారు. ఫేక్ డాక్యుమెంట్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేసినా కూడా ఈసీ స్పందించడంలేదని బీఆర్ఎస్ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వీటన్నింటిపై వీడియో ఆధారాలను సేకరించిన బీఆర్ఎస్ లీగల్ సెల్ ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. అయితే మంత్రి కొండా సురేఖకు వార్నింగ్ ఇవ్వడం మినహా చర్యలేమీ తీసుకోలేదని చెబుతున్నారు.

ఓటుకు నోటు కేసు జూలైకి వాయిదా

- **కౌంటర్ దాఖలు చేయని ప్రభుత్వం**
- **కేసును భోపాల్‌కు బదిలీ చేయాలన్న పిటిషనర్ జగదీశ్‌రెడ్డి**

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసు విచారణను సుప్రీంకోర్టు జూలై నెలకు వాయిదా వేసింది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సతీశ్‌చంద్ర మిశ్రా, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ కేసుపై శుక్రవారం విచారణ చేపట్టింది. ప్రతివాదులుగా ఉన్న తెలంగాణ ప్రభుత్వం, వ్యక్తిగత హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్‌దాఖలు చేయకపోవడంతో విచారణ జూలైకి వాయి దా పడింది. ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేసేలా ఆదేశించాలని పిటిషనర్ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి న్యాయస్థానాన్ని కోరారు. ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో కేసు విచారణను మధ్యప్రదేశ్‌లోని భోపాల్ కు బదిలీ చేయాలని కోరారు. 2015లో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రేవంత్‌రెడ్డి డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేం నరేందర్‌రెడ్డికి ఓటు వేయాలని పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సూచనలతోనే స్టీఫెన్‌సన్‌ను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించినట్టు ఆరోపణలు వచ్చాయి.

పెన్‌పహాడ్ మండలం దూపాడ్ గ్రామానికి ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో తమ గోడు వెల్లబోసుకుంటున్న మహిళలు

నోటికాడి బుక్కను పారేసుకున్నం

- **కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయినం**
- **నీళ్లందక పంటలు ఎండిపోయినయ్**
- **మళ్ల కారే రావాలి.. సారే కావాలి**
- **సాయంలో కేసీఆర్‌ను మించినోళ్లు లేరు**
- **మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఎదుట మహిళల గోడు**

పెన్‌పహాడ్, మే 3 : 'కేసీఆర్ పాలనలో రెండు పంటలు పండించి మంచిగ బతికినం. పేదోళ్లకు మంచి చేయడంలో ఆయనకు మించినోళ్లు లేరు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మోసపోయినం. నీళ్లందక పంటలు ఎండిపోయి అప్పుల పాలైనం. నోటికాడి బుక్కను పారేసుకున్నం.. మళ్లీ ఆ తప్పు చెయ్యం. ఈ సారి కారే రావాలి. కేసీఆర్ సారే కావాలి' అని సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దూపాడ్‌కు చెందిన మహిళలు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఎదుట వాపోయారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారం కోసం శుక్రవారం దూపాడ్‌కు వచ్చిన జగదీశ్‌రెడ్డితో గ్రామస్థులు, మహిళలు మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం పంటలను ఎండబెట్టిందని చెప్పి బాధపడ్డారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పేరుకు ఇద్దరు మంత్రులున్నా వాళ్ల కడుపులు ఎలా నింపుకోవాలనే ఆలోచన తప్ప రైతులకు మంచి చేయాలనే ధ్యాసే లేదని వాపోయారు. 'మీరు మంత్రిగా ఉన్నప్పుడు కాల్వగట్ల మీద రేయింబవళ్లు తిరిగి కుంటలు, చెరువులు నింపి మా పొలాలకు నీళ్లిచ్చిన్రు' అని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు రైతుబంధు కూడా రాలేదని చెప్పారు.

పట్టభద్రుల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డిని పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామానికి చెందిన రాకేశ్‌రెడ్డి బిట్స్ పిలానీ సహా అమెరికాలోనూ ఉన్నత విద్యను అభ్యసించారు. అమెరికాలో సిటీ బ్యాంక్ మేనేజర్‌గా, జేపీ మోర్గాన్, ఫేస్‌బుక్ సహా పలు అంతర్జాతీయ కార్పొరేట్ కంపెనీల్లో పనిచేశారు. రాజకీయాలపై మక్కువతో 2013లో బీజేపీలో చేరి బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, పార్టీ అధికార ప్రతినిధిగా పనిచేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరారు. పట్టభద్రుల్లో రాకేశ్ రెడ్డికి ఉన్న ఫాలోయింగ్ దృష్ట్యా బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆయనను పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించారు.

మోదీ చట్టానికి అతీతుడా..?

ప్రధాని వ్యాఖ్యలపై ఈసీని నిలదీసిన కేటీఆర్

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): అసలు దేశంలో ఎన్నికల సంఘం ఉన్నదా?.. ప్రధాని మోదీ చట్టానికి అతీతులా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని మార్చాలని కాంగ్రెస్ చూస్తుందంటూ, దళితులు, ఓబీసీల రిజర్వేషలను జిహాదిలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నదంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎన్నికలు స్వేచ్ఛగా జరుగాలని భావించే ఈసీ ఇటువంటి వ్యాఖ్యలపై ఎందుకు స్పందించడం లేదని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మాట్లాడుతున్న ప్రధానిపై ఈసీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. తాము భేటీ బచావో.. భేటీ పడావో పథకాన్ని తీసుకొచ్చామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నదని, కానీ దేశంలో జరుగుతున్న అకృత్యాలు ఆ ప్రభుత్వానికి కనిపించడం లేదని కేటీఆర్ విమర్శించారు.

కొండప్పకు ఇచ్చిన హామీ కొండెక్కింది

- **25 లక్షల ఆర్థిక సాయం దేవుడెరుగు.. అందని నెలనెలా 25 వేల పింఛన్**

నారాయణపేట, మే 3 : దేశంలోనే అత్యుత్తమ అవార్డు అందుకున్న నారాయణపేట జిల్లా దామరగిద్దకు చెందిన బుర్రవీణ కళాకారుడు దాసరి కొండప్పకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ కొండెక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం తరపున ఫిబ్రవరి 4న జరిగిన పద్మశ్రీ అవార్డు గ్రహీతల సన్మాన సభలో ఆయన్ను సన్మానించి రూ.25 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ప్రతినెలా రూ.25 వేల పింఛన్ అందిస్తామని సీఎం రేవంత్ కొండప్పకు హామీ ఇచ్చారు. కానీ ఆచరణలో మాత్రం అమలు కాలేదని పలువురు పేర్కొంటున్నారు. నెలనెలా అందాల్సిన పింఛన్ ఒక్క జనవరి నెలలో మాత్రమే వచ్చిందని, ఆ తర్వాత ఇప్పటివరకు రాలేదని కుమారుడు రాము ఆవేదన వ్యక్తం చేశాడు.

లోకం పోకడ

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	46.6°c	33.5°c
ఆదిలాబాద్	46.3°c	22.2°c
మెదక్	44.6°c	20.0°c
మహబూబ్‌నగర్	44.5°c	29.0°c
కరీంనగర్	44.0°c	28.0°c
రంగారెడ్డి	44.0°c	18.9°c
హైదరాబాద్	43.6°c	27.1°c
నిజామాబాద్	43.3°c	24.5°c
ఖమ్మం	43.0°c	29.0°c
వరంగల్	43.0°c	28.0°c

ఠారెత్తిస్తున్న ఎండలు

- **పలుచోట్ల 46.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు**
- **హైదరాబాద్‌లో 48 డిగ్రీలకు చేరుకునే అవకాశం**

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మండే ఎండలతో మాడు పగిలిపోతున్నది.. బయటికెళ్తే నెత్తి చుర్రుమంటున్నది.. వడగాలులు, ఉక్కపోత ఠారెత్తిస్తున్నాయి.. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం వివిధ జిల్లాల్లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత వారం రోజులుగా ఎండలు ఠారెత్తిస్తున్నాయి. భానుడి ఉగ్రరూపంతో ఉదయం ఎనిమిది గంటల నుంచే మొదలై సాయంత్రం దాటిన తర్వాత కూడా ఎండ వేడి ప్రభావం చూపుతున్నది. సాధారణం కంటే 2 నుంచి 5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పిల్లలు, వృద్ధులు వడ గాడ్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడదెబ్బ సోకి శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు మృతి చెందారు. హైదరాబాద్ నగరంలో ఎండలు దంచికొడుతున్నాయి. హైదరాబాద్‌లో రాబోయే ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు 45 నుంచి 48 డిగ్రీలకు చేరవచ్చుని, కనిష్ఠ ఉష్ణోగ్రత 36 డిగ్రీలు నమోదవుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. 6 నుంచి కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలొస్తాయని అంచనా వేస్తున్నట్టు ఐఎండీ హైదరాబాద్ విభాగం డైరెక్టర్ నాగరత్న తెలిపారు.

పెరుగుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పెద్దపల్లి జిల్లా మంథనిలో 46.7, నేరెళ్ల (జగిత్యాల)లో 46.7, మునగాల (సూర్యాపేట)లో 46.7, పమ్మి (ఖమ్మం)లో 46.7, కామారెడ్డిగూడెం (నల్లగొండ)లో 46.6, హాజిపూర్ (మంచిర్యాల)లో 46.5, వీణవంక (కరీంనగర్)లో 46.5, మట్టపల్లి, మామిళ్ల (సూర్యాపేట)లో 46.5, ఇబ్రహీంపట్నం (నల్లగొండ)లో 46.5, కేసముద్రం (మహబూబాబాద్)లో 46.4, ఉట్కూరు (నారాయణపేట)లో 46.4 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

దేశవ్యాప్తంగా భగభగలు

ఈ ఏడాది ఏప్రిల్ తొలి వారం నుంచే సూరీడు ఉగ్రరూపం దాల్చాడు. ఫలితంగా ఏప్రిల్‌లో 45 డిగ్రీల ఉష్ణోగ్రత దాటిపోయింది. వచ్చే ఐదు రోజుల్లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో వాతావరణం మరింత వేడెక్కుతుందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది.

పిడుగుపాటుతో ఇద్దరు మృతి

ములకలపల్లి/పెనుబల్లి, మే 3: రాష్ట్రంలో శుక్రవారం పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం ఒడ్డురామవరం గ్రామానికి చెందిన రైతు బోడ శివరాం (43) మార్కెట్ యార్డులో ధాన్యాన్ని కుప్ప చేస్తుండగా పిడుగుపడి మృతిచెందాడు. మరో రైతు గుగులోతు శ్రీనుకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నాడు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కందిమల్లవారి బంజరకు చెందిన కూలి ఎరికెపల్లి పూర్ణచంద్రరావు (34) పశువులను తోలుకొని వెళ్తుండగా పిడుగుపడి మృతిచెందాడు.

రాష్ట్రానికి పట్టిన శని రేవంత్‌రెడ్డి

- **బీఆర్ఎస్ నేత గట్టు రాంచందర్ రావు**

హైదరాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి పట్టిన శని రేవంత్‌రెడ్డి అని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయడం ద్వారా శనిని వదిలించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ నేత గట్టు రాంచందర్‌రావు అన్నారు. రేవంత్‌రెడ్డికి బీజేపీతో రహస్య ఒప్పందం ఉందని ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఇప్పటికీ సీఎం హోదాను మరిచి మాట్లాడుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి అత్యంత పిరికిపంద అని, ఢిల్లీకి పోయి బీజేపీ నేతల కాళ్లు పట్టుకుంటాడని విమర్శించారు. కేసీఆర్ ప్రచారాన్ని 48 గంటలు ఆపడం వెనుక తెర ముందు కాంగ్రెస్, తెర వెనుక బీజేపీ ఉన్నాయని మండిపడ్డారు. కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లడంతో కాంగ్రెస్, బీజేపీల్లో వణుకు పుట్టిందని అన్నారు. రేవంత్ రెడ్డిని కాంగ్రెస్‌పార్టీ ఎప్పటి వరకు సీఎంగా ఉంచుతుందో తెలియదన్నారు. రేవంత్ రెడ్డి భాషపై ఎన్నికల సంఘానికి 8 ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదని ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మూడవ స్థానం ఖాయమని జోస్యం చెప్పారు.